

దోపిడీకి పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ
అధిక తేమ, నూకల శాతం వంటి సాకులతో ధాన్యం కొనుగోళ్లలో రైతుల నుంచి అదనంగా సొమ్ము, అధిక పరిమాణం ధాన్యం వసూలు చేసే మిల్లర్లపై కఠిన చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు జిల్లాలోని రెండు రైస్ మిల్లులకు నోటీసులు జారీ చేసి, వాటిని అనుసంధానించిన రైతు భరోసా కేంద్రాల నుండి డిటాచ్ చేశామని తెలిపారు. జగ్గంపేట మండలం, రాజుపాలెంలోని వెంకట దుర్గా రైస్ మిల్లు, పిఠాపురంలోని రెడ్డి రామకృష్ణ రైస్ మిల్లులకు ఈ నోటీసులు జారీ చేశామన్నారు. రైతుల నుండి అదనంగా వసూలు చేసిన సొమ్మును, అదనంగా తీసుకున్న ధాన్యం విలువ మొత్తాన్ని తిరిగి రాబట్టి రైతులకు ఇప్పించామని తెలిపారు.

అయ్యో.. ఉపాధి కూలీలు

- ఎండల్లో నిలువ నీడ కరువు
- కానరాని టెంట్లు, తాగునీరు
- వసతుల కల్పన మరచిన సర్కారు


సామర్లకోట మండలం చంద్రంపాలెంలో మండుటెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి
పొట్టకూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్నాం. రోజూ పనికి వెళితేనే గాని మాకు పూట గడవదు. ఈ ఎండల్లో ఉపాధి పనులు చేస్తూ అలసట వస్తే విశ్రాంతి తీసుకునేందుకు కనీసం ప్రభుత్వం టెంట్లు కూడా ఇవ్వడం లేదు. ఎక్కడో దూరంగా ఉన్న చెట్ల కిందకు వెళ్లి సేద తీరుతున్నామని సామర్లకోట మండలం చంద్రంపాలెంకు చెందిన ఉపాధి కూలీలు కుడిపూడి లక్ష్మి, ఎలిశెట్టి వీరభద్రరావు, సలాది అబ్బద్ధం ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదు. గతంలో తాగునీరు, మజ్జిగ భత్యాలు ఇచ్చేవారు. మాకెవ్వరూ అందడం లేదని ఇదే మండలంలోని పెద బ్రహ్మదేవరం గ్రామానికి చెందిన మందాల వీరలక్ష్మి, మలకల చినబాబు, పిఠాపురం మండలం గోకివాడ గ్రామానికి చెందిన బిళ్లకుర్తి శ్రీనివాస్, నామా పద్మరాజు తదితరులు తెలిపారు.

కాకినాడ జిల్లాలో 21 మండలాల్లో 3.42 లక్షల జాబ్ కార్డులుండగా 5.96 లక్షల మంది కూలీలు నమోదయి ఉన్నారు. వీరిలో 4,59,414 వేతనదారులు రెగ్యులర్‌గా పనులకు వెళుతున్నారు. ప్రస్తుతం ఈ వేసవిలో 40 నుంచి 44 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం సుమారు 87 వేల మంది పనులకు వెళుతున్నారు. ఈ పథకం పనుల్లో భాగంగా ప్రభుత్వ స్థలాలు, రైతుల పొలాల గట్లపై మొక్కల పెంపకం, చెరువులు, పంట కాలువల్లో పూడిక పనులు చేస్తున్నారు.

పని ప్రదేశంలో కొరవడిన భద్రత

ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. దానికి తోడు వడ గాలులు వీస్తున్నాయి. అయినా గ్రామీణ వ్యవసాయ కార్మికులు కుటుంబాలను పోషించుకునేందుకు పనులకు వెళ్లక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో పలువురు ఎండలకు తట్టుకోలేక వడ దెబ్బ తగిలి పడిపోతున్నారు. అయినా పని ప్రదేశంలో ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. దీనిపై ప్రజాశక్తి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయగా పలువురు తమ ఆవేదన వెలిబుచ్చారు. సామర్లకోట మండలంలో 7,195 మంది యాక్టివ్ కూలీలు ఉండగా ప్రస్తుతం 3,550 మంది పనులకు వెళుతున్నారు. పని ప్రదేశాల్లో నిలువ నీడ, తాగేందుకు గుక్కెడు నీళ్ల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటితో సరిపెడుతున్నారు. ఈ మండలం చంద్రంపాలెంలో 1500 మంది కూలీలుండగా 290 మంది పనులకు వెళుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 23 ఎకరాల మసీదు చెరువు పూడిక పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయిన తర్వాత సమీపంలో ఉన్న చెట్ల కిందకు వెళ్లి సేద తీరాల్సి వస్తోంది. పిఠాపురం మండలం రాయవరంలో 350 మంది పని చేస్తున్నారు. వీరు సేద తీరుదామన్నా సమీపంలో చెట్లు కూడా లేవు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే కనీసం ప్రాథమిక చికిత్స కూడా అందుబాటులో లేదు. పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మికులు కోరుతున్నారు.



ఉదయమే పనులు నిర్వహిస్తున్నాము

వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 గంటలకల్లా కూలీలను పనులకు రప్పిస్తున్నాం. ఎండ ముదరకుండానే తిరిగి 11 గంటలకు ఇళ్లకు పంపేలా చర్యలు తీసుకుంటున్నాం. మెట్ల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం.
- శ్రీలలిత, ఎంపిడిఒ, సామర్లకోట



కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు

గతంలో టెంట్లు పంపిణీ చేసేవారు. తాగునీరు, మజ్జిగ కోసం కొంత సొమ్ము అదనంగా ఇచ్చేవారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తుందని అధికారులు చెబుతున్నారు. కావున పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
- చిట్టిబాబు, ఉపాధి కూలీ, పిఠాపురం మండలం



ఎండలతో పని చేయలేకపోతున్నాం

ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పిల్లలను పోషించుకునేందుకు పనులకు రావడం తప్పడం లేదు. ఎండవేడికి ఎక్కువ సమయం పని చేయలేకపోతున్నాం. కావున ప్రభుత్వం నీడ కోసం టెంట్లు తదితర సౌకర్యాలు కల్పించాలి.
- కేతా పద్మ, ఉపాధి కూలీ, చంద్రంపాలెం, సామర్లకోట మండలం.

బ్రిజ్ భూషణ్‌ను తక్షణం అరెస్టు చేయాలి


సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ
మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో దువ్వా శేషబాబ్జి అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు మాట్లాడారు. 25 రోజులుగా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లను పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 39 కేసుల్లో నిందితునిగా ఉన్న బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణం అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించి, సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న రెజ్లర్ల శిబిరం వద్ద విద్యుత్తు పంపిణీ, మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని, ఆందోళనకారుల పట్ల అసభ్యంగా, అమానుషంగా వ్యవహరించిన ఢిల్లీ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజాసంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమించుతామని హెచ్చరించారు. గతంలో అసిఫా అత్యాచారం, హత్య సందర్భంగా, ఉన్నావ్ ఘటన సందర్భంగా బిజెపి నాయకులు దోషుల పక్షం వహించారని గుర్తు చేశారు. ఈ నెల 20న ఉదయం 10 గంటలకు రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా కాకినాడ జిల్లా కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, శ్రామిక మహిళా సంఘాల కార్యకర్తలతో ఆందోళన నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు నర్ల ఈశ్వరి, నాయకులు నాగలక్ష్మి, వేణి, మొగలి బేబి, 108 ఉద్యోగుల సంఘం నాయకులు రమణ, జిజిహెచ్ నాయకులు తలుపులమ్మ, ఎఐసిసిటియు నాయకులు నరసరాజు పాల్గొన్నారు.

22న కాకినాడలో మినీ మహానాడు



ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
ఈ నెల 22న కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో మినీ మహానాడును నిర్వస్తున్నామని టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తెలిపారు. గురువారం కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ శతవసంతాల సందర్భంగా ఆయా జిల్లాల్లో నిర్వహించిన ఈ మినీ మహానాడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఈ నెల 27, 28 తేదీల్లో రాజమండ్రిలో భారీ ఎత్తున మహానాడుని నిర్వహిస్తున్నామని 27న లక్ష మందికి, 28న రెండు లక్షల మందికి భోజన వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. యువగళం వంద రోజులు పూర్తి చేసుకుందని ఈ యాత్రలో తమ యువనేత లోకేష్ 1250 కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు చెప్పారు. ఈ పాదయాత్రలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను లేవనెత్తి ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడంలో ఆయన ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. రైతులు తడిసిన ధాన్యాన్ని మండుటెండలో ఎండ పెడుతుంటే వైసిపి ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. రైతు పండించిన ధాన్యం ఆర్‌బిఐ కేంద్రాల విధానాలు అమలు కావడం లేదని వారు ఏ రైస్ మిల్లుకు ధాన్యం తీసుకువెళ్లాలో చెప్తున్నారని అక్కడికి వెళ్లిన తర్వాత తేమ, తడి, మొలకలు వచ్చాయంటూ లారీకి సుమారు రూ.20 వేల నష్టం వచ్చేలా విధానాలు రూపొందించడంతో రైతులు ఆ ధాన్యాన్ని తిరిగి తెచ్చేందుకు అదనపు భారం అవుతుందని గ్రహించి వారు చెప్పిన ధరకే ధాన్యమును అమ్ముతున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎండీ జిలానీ, కోర్పు సాయి తేజ, బుర్రి సత్యనారాయణ, తూము కుమార్, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా వాలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం రంగరాయ మెడికల్ కాలేజ్ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. కాకినాడ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వాలంటీర్లను మంత్రి దాడిశెట్టి రాజా పురస్కారాలతో సన్మానిస్తారని కమిషనర్ డాక్టర్ వి.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎంఎల్ఎలు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. వాలంటీర్ల పనితీరుకు సంబంధించి పలు అంశాలను పరిగణలోని తీసుకుని వారికి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సన్మానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సి హెచ్.నాగ నరసింహారావు, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, పర్యవేక్షక ఇంజినీర్ పి.సత్య కుమారి, ఎంహెచ్ఒ పృథ్వీచరణ్, డిసిపి హరిదాస్, సెక్రెటరీ ఏసుబాబు, మేనేజర్ సత్యనారాయణ, డిపిఆర్ఒ మానే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హోమ్ గార్డుల కుటుంబాలకు సాయం


సాయం అందిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
విధి నిర్వహణలో మరణించిన హోమ్ గార్డుల కుటుంబాలకు, వెల్ఫేర్ ఫండ్ నుంచి వారికి వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స నిమిత్తం నగదు చెక్కులను ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ గురువారం అందజేశారు. సర్వీసులో ఉండి మరణించిన ఎం.గోవింద్ కుటుంబానికి గోవింద్ బ్యాచ్ హోమ్‌గార్డులు సమకూర్చిన రూ.54,000 చెక్కును, 8 మంది హోమ్‌గార్డ్‌లకు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యల చికిత్సల నిమిత్తం పోలీస్ వెల్ఫేర్ నిధి నుండి మంజూరు కాబడిన రూ.80,000 చెక్కులను ఎస్‌పి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం
అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన పేదలకు ఉచితంగా సేవలందించే బిహెచ్ఎంపిఎ అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు పి.కిరణ్ కుటుంబాన్ని ఆదుకోవడానికి అందరూ ముందుకు రావాలని బిఎంపి అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు అందే చిట్టికొండ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కుటుంబం మొత్తం గాయాల పాలై కన్న కొడుకుని కడసారి కూడా చూసుకోలేని దుస్థితిలో కుటుంబం మొత్తం ఆసుపత్రిలో ఉందని తెలిపారు. ఆర్థిక సహాయం అందించే దాతలు ఫోన్ పే నెంబర్ 7659870870కు పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వారిలో గ్రామీణ వైద్యులు కేశిం వెంకటేశ్వరరావు, గుండేపల్లి ప్రసాద్ ఉన్నారు.

ప్రమాదకరంగా గొల్లలరేవు వంతెన


జారిన ట్రాక్టర్‌ను లాగుతున్న మరో ట్రాక్టర్

ప్రజాశక్తి - తాళ్లరేవు
కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం, కాజులూరు మండలాలను అనుసంధానం చేసే గొల్లల రేవు వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెన నిర్మించి సుమారు దశాబ్దాలు కావస్తున్న అప్రోచ్ నిర్మాణంలో భాగంగా ఇంజనీరింగ్ వైఫల్యం కారణంతో లోడు వాహనాలు వంతెన పైకి వచ్చే సమయంలో తరచూ వెనక్కి జారిపోతున్నాయి. దీంతో వాహనాల వెనక వచ్చే ప్రజలు, ప్రయాణికులు ప్రయాణికు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కాజులూరు వైపు శీలలంక, కోరంగి పంచాయతీ బొడ్డువానిలంక తదితర ప్రాంతాల నుంచి వస్తున్న ధాన్యపు లోడు ట్రాక్టర్లు గొల్లరేవు వంతెన ఎక్కలేక వెనక్కి జారుతున్నాయి. ఇటీవల కాలంలో తాళ్ళరేవు వైపున ఉన్న అప్రోచ్‌ను కొంతవరకు లెవెలింగ్ చేశారు. కాజులూరు వైపు ఉన్న అప్రోచ్‌ను వదిలేశారు. దీంతో అప్రోచ్ ఎక్కేటప్పుడు వాహనాలు ఎత్తు ఎక్కలేక ఆ డ్రైవర్లు ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు కాజులూరు వైపు అప్రోచ్ రోడ్డుపై మధ్యలో గోతులు పడడంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాజులూరు, తాళ్ళరేవు మండలాల నుంచి నిత్యం ధాన్యం లోడుతో వెళ్లే ట్రాక్టర్లు ఈ వంతెన పైనుంచే తాళ్ళరేవుకు అటు కాజులూరు కు వెళ్లడం వల్ల ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే నష్టం అధికంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు ఇచ్చే స్థలాలపై విమర్శ సరికాదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్
ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై లోకేష్, చంద్రబాబు అవాకులు చెవాకులు పేలుతున్నారని వైసిపి మహిళా రీజినల్ కన్వీనర్, రాష్ట్ర సివిల్ సప్లైయిస్ కార్పొరేషన్ డైరక్టర్ జమ్మలమడక నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా కొత్త గ్రామాలు రూపుదిద్దుకుంటున్నాయని, అలాంటి పథకాన్ని శ్మశానంతో పోల్చడం చూస్తుంటే లోకేష్ అజ్ఞానం బహిర్గతమవుతోందన్నారు. చంద్రబాబు హయాంలో ఒక ఇళ్ల స్థలం ఇచ్చిన పరిస్థితి లేదనీ నేడు లక్షల లబ్ధిదారులకు ఇళ్ళు నిర్మించటమే కాక అక్కడ మౌలిక సదుపాయాలు సైతం కల్పిస్తున్నట్టు చెప్పారు. కోవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితిలో సైతం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సిఎం వైఎస్.జగన్మోహనరెడ్డిదన్నారు. కోవిడ్ సమయంలో స్కూల్స్ లేకపోయినా అమ్మఒడి లాంటి పథకం, ఉచిత బియ్యం వైసిపి ప్రభుత్వం ఇచ్చిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకం లబ్ధిదారుడికి చేరితే కనీస కష్టమైనా తీరుతుందని సిఎం జగన్ ఆలోచన అన్నారు.

ఉత్తమ విద్యార్థుల సత్కారానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ
జిల్లాలో ప్రభుత్వ పాఠశాలు, జూనియర్ కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఇతర ఉన్నత స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు డా.కతికాశుక్లా, జెసి ఎస్.ఇలక్కియా, హాజరయ్యారు. పదోతరగతి ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల సత్కారం కార్యక్రమం ఏర్పాట్లు, విద్యార్థుల జాబితా ఇతర అంశాలపై విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇతర అధికారులు జిల్లా కలెక్టర్లతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 23న అన్ని నియోజకవర్గ స్థాయిలోను, 27న జిల్లా స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌ను సన్మానిస్తామన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేల నగదు బహుమతి, పతకం, సర్టిఫికెట్, జ్ఞాపిక అందిస్తామన్నారు. ఈ వీసీలో జిల్లా విద్యాశాఖ అధికారి కెఎన్‌వియస్ అన్నపూర్ణ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం
బాలల్లో నీతి కథల ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఉపాధ్యాయిని వాడపల్లి విమలా రాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆమె బాలలకు నీతి కథలు బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీతి కథలు బాలలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయన్నారు. బాల్యంలో ఎదుర్కొనే సమస్యల గురించి ఆమె వివరించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది బుల్లయ్య, మరియమ్మ పాల్గొన్నారు.

చదరంగం ద్వారా మానసిక వికాసం


చదరంగం క్రీడ ద్వారా ఏకాగ్రత అభివద్ధి చెంది మానసిక వికాసం సిద్ధిస్తుందని చదరంగం అంతర్జాతీయ క్రీడాకారుడు ముప్పన సంతోష్ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో గురువారం ఆయన బాలలకు చదరంగం క్రీడకు సంబంధించి పలు రకాల మెలకువలను బోధించారు. ఈ సందర్భంగా ఆయన ఒకేసారి 9 చెస్ బోర్డులపై 9 మంది విద్యార్థులతో చెస్ ఆడి విద్యార్థుల్లో చదరంగం పట్ల ఆసక్తిని పెంపొందించారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంఎస్‌సి మూర్తి మ్యాథ్స్ వివరించారు. కరాటేలో పూజిత సూర్యశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూనిరెడ్డి అరుణ, రవికుమార్, డి.కృష్ణ, అమత, నమ్రత, మంజుల, రవి, సూరజ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - పెద్దాపురం
స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని యాసలపు సూర్యారావు బస్సు షెల్టర్ వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, దారపరెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, కూనిరెడ్డి అప్పన్న, నరసింహమూర్తి, కె.అరుణ పాల్గొన్నారు.



సాగుహక్కు పత్రాలు తప్పనిసరి


సామర్లకోట రూరల్‌లో సమావేశంలో పాల్గొన్న రైతులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్, పెద్దాపురం
రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పొందాలంటే పంట సాగుహక్కు పత్రాలు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య అన్నారు. మండలంలోని పిబి దేవం రైతుభరోసా కేంద్రంలో పంటసాగు హక్కు పత్రం (సిసిఆర్‌సి) కౌలు కార్డుల ఉపయోగంపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇమ్మిడిశెట్టి సత్య మాట్లాడుతూ పంట సాగు హక్కు పత్రంయొక్క ఉపయోగాలను వివరించారు. సాగుదారునకు రుణార్హత, భూ యాజమానికి చట్టబద్ధ హామీ, ఆంధ్రప్రదేశ్ పంట సెక్షన్ 3(2), 8 (2) ప్రకారం సాగు హక్కు చట్టం 2019 ప్రకారం ఈ సాగు హక్కు పత్రాలు అందిస్తున్నట్టు చెప్పారు. వీటికాల పరిమితి 11 నెలలు (కార్డు జారి చేసిన తేదీ నుంచి) ఉంటుందన్నారు. కౌలు కార్డ్ తీసుకున్న రైతుకు మాత్రమే పంట నమోదు చేసే అవకాశం ఉంటుందన్నారు. కౌలు కార్డు ద్వారానే సున్నా వడ్డీ రుణాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి రైతులు, కౌలు రైతులకు భరోసా రూ.13,500 పడతాయన్నారు. కాబట్టి కౌలు రైతులంతా విధిగా సాగు హక్కు పత్రాలను పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మలకల సూర్యారావు, గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, విఆర్ఒ శ్రీపృథ్వీ, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.మౌనిక, ఎం.ప్రవలిక పాల్గొన్నారు.

పెద్దాపురం మండలం ఆనూరులోని రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్ కుమార్ మాట్లాడారు. గుర్తింపు కార్డు ఉండటం వల్ల గిట్టుబాటు ధరలకు వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం, ఎరువులు, పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీలు లభిస్తాయన్నారు. ప్రతి కౌలు రైతు ఈ సిసిఆర్‌సి కార్డును పొందాలన్నారు. ఈ కార్డు పొందేందుకు సంబంధించిన అన్ని వివరాలతో ఆర్‌బికె సిబ్బంది కౌలు రైతులకు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ సదస్సులో సర్పంచ్ నూకపల్లి అనితారాణి, కునాపురెడ్డి స్వామి, సింగన త్రిమూర్తులు, నూకపల్లి నరేష్, విఆర్ఒ రాజు, ఆర్‌బికె ఇన్‌ఛార్జి జి.చంద్రరావు,కౌలు రైతులు పాల్గొన్నారు.

సుంకరపాలెంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు
మండలంలోని సుంకరపాలెం పంచాయతీ ఆవరణలో సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎండ వేడి ఎక్కువగా ఉన్నందున బాటసారులు, పంచాయితీకి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రజలకు పంపిణీ చేశారు. వేసవికాలం అంతా పూర్తిగా ఈ చలివేంద్రం కొనసాగిస్తామని సర్పంచ్ నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, వార్డు సభ్యులు పితాని అర్జునరావు ,జి. సుబ్రహ్మణ్యం. ఎమ్.గణేష్, పలివెల సత్యవతి,సుంకర గోపి, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పెదపూడి
వ్యవసాయ రంగ అభివృద్ధికి యువసేన అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెదపూడి మండల వ్యవసాయ అధికారి మణిదీప్ కోరారు. పెదపూడి మండలం కైకవోలు, అచ్యుతాపురం గ్రామాల్లో రైతులు కౌలు రైతులకు ప్రత్యేక అవగాహన నిర్వహించారు. మే 27 వరకు అన్ని గ్రామాల్లోనూ వ్యవసాయ శాఖా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కౌలు కార్డ్‌ల నమోదు ఉచిత పంటల బీమా వడ్డీ అంశాలపై ఎఒ వివరించారు.


జాతరలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

మదుగులమ్మ జాతరలో ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్
హుస్సేన్‌పురంలో గ్రామ దేవత మదుగులమ్మ అమ్మవారి జాతర పూజల్లో గురువారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. తొలుత జాతర పూజల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎంఎల్ఎ చినరాజప్పకు గ్రామ నాయకులు చల్లా బుజ్జి, ఆలయ కమిటీ నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చల్లా బుజ్జి, గుమ్మళ్ల రామకష్ణ, పుప్పాల నాయుడు, మార్ని రాజు, కోట వెంకన్న, పుప్పాల శ్రీను, మార్ని వీర్రాజు, మార్ని సూర్యారావు, మార్ని నాగరాజు, జి.చిట్టి, అప్పారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కాజులూరు

అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. స్థానికులు కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం కౌలు రైతు గుండుపల్లి ఆంజనేయులు(42) 20 సంవత్సరాలుగా కౌలుకు వ్యవసాయం సాగు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత ఐదు సంవత్సరాలుగా నష్టాల బారిన పడ్డాడు. 7 లక్షల వరకు అప్పులు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల కాలంలో అప్పులు ఇచ్చిన వారి నుండి తీవ్ర ఒత్తిడి పెరగడంతో బుధవారం మధ్యాహ్నం కూల్ డ్రింకులో పురుగులు మందు కలుపుకొని తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గురువారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందాడు. మతుడు ఆంజనేయులుకు భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. మతుని కుటుంబాన్ని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు పరామర్శించారు. ప్రభుత్వం ఆంజనేయులు కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

రోడ్డు ప్రమాదంలో గురువారం మహిళకు గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామానికి చెందిన ఈరేటి మంగమ్మ, ఆమె భర్త శ్రీను మోటార్ సైకిల్ పై జగ్గంపేట వైపునకు వెళుతున్నారు. వారు మల్లేపల్లి గ్రామశివారు వద్దకు వచ్చేసరికి జగ్గంపేట వైపు వెళుతున్న సమయంలో లారీ డ్రైవర్ వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ పై ఉన్న తీవ్ర గాయమైంది ఆమె కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లుగా వచ్చిన ఫిర్యాదు పై గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు


అదుపులోనికి తీసుకున్న నిందితులతో గండేపల్లి పోలీసులు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గండేపల్లి

ఏజెన్సీ ప్రాంతం చింతపల్లి నుంచి బాపట్లకు రెండు మోటార్ సైకిల్ పై 21 కేజీల గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను గురువారం గండేపల్లి వద్ద పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాలు ఇవి.. గండేపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేసిన సమయంలో నలుగురు వ్యక్తుల్ని అదుపులో తీసు కున్నారు. ఎస్ఐ గణేష్ కుమార్, సిఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో నలుగురు వ్యక్తులను విచారణ చేశారు. రూ.రెండు లక్షల విలువైన గంజాయిని రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు వ్యక్తులు తీసుకువెళుతున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి సుమారు రూ.రెండు లక్షల విలువ చేసే గంజాయి 3 సెల్ ఫోన్లు రెండు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సిఐ తెలిపారు.


ఇసుక అక్రమ రవాణా

ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని పోతవరం, పోతునీడుపాలెం, కవులూరు, నబీపేట, అనంతపల్లి, గ్రామాల వెంబడి ఉన్న ఎర్ర కాలువ నుండి అక్రమార్కులు ఇసుకను తవ్వి తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని పలువురు అంటున్నారు. రోజుకు మండలవ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 ట్రాక్టర్ల వరకు ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. గ్రామాల్లో ఇల్లు కట్టుకునే వారికి చేరడంత ఇసుక కరువైపోగా పక్క మండలాల్లోని గ్రామాలకు స్థానికంగా ఉన్న ఎర్రకాలు నుండి ఇసుక తరలిపోతోంది. ఇసుక తరలించేందుకు ప్రభుత్వం నుండి ఏ విధమైన పర్మిషన్లు లేనప్పటికీ రాత్రీ పగలూ తేడా లేకుండా అక్రమార్కులు ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఎదురుపడిన వారికి ఎంతో కొంత చేతులు తడిపి రోజుకు రూ.వేలకు వేలు కూడ పెడుతున్నారు. ఒక ట్రక్కు ఇసుక నాలుగు వేల నుంచి డిమాండ్ ను బట్టి ఐదువేల వరకు అమ్ముతున్నారు ఈ విధంగా ఒక్కో ట్రాక్టర్ యజమాని రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు. గతంలో పోలీసు అధికారులు రెవెన్యూ అధికారులు ఇసుక ట్రాక్టర్ కనిపిస్తే కేసు రాసేవారు ప్రస్తుతం పట్టపగలే వారి కళ్ళముందే ఇసుక ట్రాక్టర్లు వెళుతున్న పట్టించుకోవడంలేదని ప్రజల్లో విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణా దారులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదివాసీ సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - సీతానగరం

విశాఖలో ఈ నెల 21న జరిగే అఖిల భారత ఆదివాసీ సదస్సును జయప్రదం చేయాలని రైతుకూలీ సంగం జిల్లా కార్యదర్శి పల్ల వెంకటనాయుడు పిలుపునిచ్చారు. గురువారం చీపురుపల్లిలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అభివృద్ధి పేరుతో అడవి నుంచి గెంటేసే కుట్ర చేస్తున్నాయన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. బిజెపి- ఆర్ఎస్ఎస్ కూటమి ఆదివాసి చట్టాలను సవరణల పేరుతో మార్పు చేసి బడా కార్పొరేట్ కంపెనీలకు అటవీ సంపదను ధారాదత్తం చేస్తుందన్నారు.

కేబుల్ ఆపరేటర్లతో కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - యానాం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

యానాం నియోజకవర్గంలో ఉన్న కేబుల్ ఆపరేటర్లతో మున్సిపల్ కమిషనర్ గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు యానాం మునిపల్ కమిషనర్ గోయల్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్ఒ డివిరాజుతో పాటు స్పైవిజన్ కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోయల్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సదర్భంగా ఎంఎస్ఒ డివిరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ టాక్స్ పేరుతో తీసుకువచ్చిన జిఎస్‌టి అనంతరం దేశంలో ఎక్కడా వినోదపన్నును వసులు చేయడం లేదని అప్పటినుండే టాక్స్ నిలుపుదల చేసినట్టు చెప్పారు. తాను ఇప్పటికి మున్సిపాలిటికి సహకరించేందుకు సిద్ధంగానే ఉన్నానని అయితే కొందరు ఉద్యోగులు తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. నెట్‌వర్క్ పూర్తిగా డిజిటల్ అని దీనికి సంబంధించిన యాప్ మున్సిపాలిటికి ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజన్ ఖండపల్లి రామకృష్ణ, ఎఇ మేడిశెట్టి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యాపురం బ్యాంకు వద్ద మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రధాన శాఖ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, ఇలాంటి సమయంలో ప్రజలు, బాటసారులు, ఖాతాదారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తున్న బ్యాంకు పాలకవర్గం సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ గిరజాల రామకృష్ణతులసి, గిరజాల వీర్రాజు, డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, నక్కెళ్ల బాబూరావు, యర్రా ప్రసాద్, పెంకే సురేష్, పతివాడ రమేష్ బాబు, రాయుడు గణేష్, వీణమ్ వెంకటేశ్వరరావు, గొర్రిపాటి లీలా గంగాధరరావు, బ్యాంకు కార్యదర్శి కొండేటి స్వరాజ్యలక్ష్మి, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నాయకులు మజ్జి అప్పారావు, టికె.విశ్వేశ్వరరెడ్డి, ఎన్‌వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పెట్రోల్ బంకులపై పలువురి ఫిర్యాదుల నేపథ్యంలో జెసి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నగరంలో పలు పెట్రోల్ బంకుల్లో తనిఖీ చేపడుతున్నట్లు డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు గొట్టిముక్కల అనంతరావు తెలిపారు. గురువారం జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు, మండల సప్లయీస్ ఆఫీసర్ ప్రభాకర్‌తో కలిసి నగరంలోని పలు పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ పెట్రోల్ బంకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రజలకు గాలి, నీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉచితంగా అందించాలన్నారు. బంకు సిబ్బంది వినియోగదారులకు అసౌకర్యం కలిగించకుండా, గౌరవంతో మెలగాలన్నారు. శామ్యూల్‌రాజు మాట్లాడుతూ పెట్రోల్ కొలతల విషయంలో కచ్చితంగా మీటర్లు ఉండాలని, దేశవ్యాప్తంగా అన్ని బంకుల్లో ఆధునిక టెక్నాలజీ ద్వారా మీటర్లు అమర్చబడ్డాయని, వినియోగదారులు అపోహలు నమ్మొద్దన్నారు. తనిఖీల్లో ఎక్కడా తేడా రాలేదన్నారు. ఫిర్యాదులు వస్తే కచ్చితంగా తనిఖీ చేసి చర్యలు చేపడతామన్నారు.


ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న చింతా శివ

ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యానాం

తాళ్ళరేవు బైపాస్ రోడ్ లో ఇటీవల ప్రైవేటు బస్సు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు, క్షతగాత్రులకు యానాంకు చెందిన చింతా శివ ఆర్థిక సాయం అందించారు. రూ.10 వేలు చొప్పున అందచేశారు. చింతా గణేష్ సమకూర్చిన ఈ మొత్తాన్ని ఆయన సోదరుడు శివ బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. కాకినాడలోని ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను శివ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంచాల జిమ్మి, నిమ్మకాయల శ్రీనివాస్, చింతం అజయ్‌కుమార్, ఏరుబండి స్వామి, పెంటపాటి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐ

ట్రాఫిక్ నిబంధనలపై కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ వాహనదారులకు, పాదాచారులకు, వ్యాపారస్తులకు గురువారం కరపత్రాలు పంచారు. యానాం పోలీస్ శాఖ ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో సిఐ షణ్ముగం అధ్యక్షతన స్థానిక కె.జంక్షన్, పాత బస్టాండ్, న్యూ బస్టాండ్‌లో ప్రజలకు ప్రమాదాల నివారణపై సూచనలు చేశారు. రహదారి నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్ల,క్రైమ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



నిరసన తెలుపుతున్న సిఐటియు సభ్యులు

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - యానాం

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బిజెపి పార్లమెంటు సభ్యుడైన బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ క్రీడాకారులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 25 రోజులుగా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్ల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 39 కేసుల్లో నిందితునిగా ఉన్న బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణం అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించి, సుప్రీంకోర్టు లేదా హై కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల వాసు, రమేష్, యాదల శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, కె.సత్యనారాయణ, తిరుకోటి శ్రీనివాస్, గణేష్, సోమరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రులను పరామర్శించిన ఎంఎల్ఎ అశోక్

క్షతగాత్రులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - యానాం

తాళ్లరేవు బైపాస్ వద్ద ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ గురువారం పరామర్శించారు. డాక్టర్లను క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోరుకునే వరకు వైద్య సేవలు కొనసాగించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. అనంతరం క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో అయన మాట్లాడారు. ఎవరూ అధైర్య పడవద్దని మీకు అండగా ఉంటానని, అందరూ కోలుకుంటారని భరోసానిచ్చారు.

యానాంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - యానాం

రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక యానాం టాక్సీ స్టాండ్ వద్ద గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజుకొకరు చొప్పున మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సభ్యులను టాక్సీ స్టాండ్ యూనియన్ ప్రెసిడెంట్ కెవివి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు కుంచే సత్యనారాయణ, ఇళ్ల వాసు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పాల్గొని వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రేవు విష్ణు, మధు, సత్తిబాబు, కె.సత్యనారాయణ, తిరుకోటి శ్రీను, శ్రీను, శీలం సత్యనారాయణ పాల్గొన్నారు.

21న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 21న ఆదివారం అన్ని వ్యాధులకు సంబంధించి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక మహాత్మా గాంధీ బాయ్స్ హై స్కూల్లో ఏర్పాటు చేస్తున్నట్టు లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ ప్రెసిడెంట్ పులవర్తి శ్రీను ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు.

సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అమలాపురం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

జిల్లాలోనిఖరీఫ్ పంటకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం అమలాపురం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలో పెండింగ్ లో ఉన్న, ప్రస్తుతం జరుగుతున్న ఇరిగేషన్ పనులపై తదితర అంశాలపై అధికారుల తో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ తాగు నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చోట త్రాగునీటిని ప్రత్యేక వాహనాలతో సరఫరా చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ పనులకు సంబంధించి సాధ్యమయ్యే ప్రాంతాలలో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు ఉపాధి హామీ పనుల తో అనుసంధానం చేసుకొని పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ కు సాగునీటిని విడుదల విషయం లో ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. జిల్లా లో షట్టర్లు, ఔట్ ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతు పనులు, కాలువ ల పూడిక తీత పనులకుసంబంధించి ప్రతిపాదనలు ఏమైన ఉంటే వెంటనే కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సుబ్బయ్య (డ్రెయిన్లు), కాశీ విశ్వవేశ్వరరావు (హెడ్‌వర్క్స్), విజయ గోపాల్ (ఈస్ట్రన్ డివిజన్) డి.రామ్‌గోపాల్ (సెంట్రల్ డివిజన్), డ్వామా పీడీ మధుసూధన్, ఎస్ఇ పంచాయతీ రాజ్ చంటి బాబు, సిపిఓ వెంకటేశ్వర్లు, ఎస్ఇ ఆర్‌డబ్ల్యూఎస్ కష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - అంబాజీపేట

మండలంలోని మాచవరం శివారు పోతాయిలంకలో గురువారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కొప్పిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన తాటా కిల్లు కాలి బూడిదయ్యింది. ఈ అగ్నిప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోయారు. శ్రీనివాస్ ఇంటి అటుకపై కొప్పిశెట్టి బాల వెంకట రమణకు చెందిన 15 వేల కురిడీ కొబ్బరి కాయ ప్రమాదంలో కాలిపోయాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.1.50 లక్షలు విలువ చేసే కొబ్బరి కాయలతో పాటు రూ.50 వేలు విలువ చేసే గహోపకార వస్తువులు కాలిబూడిదయ్యాయి. రూ.2లక్షలు ఆస్థి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.


బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబానికి ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బియ్యం, నిత్యవసరాలు పంపిణీ చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్‌పర్సన్ దొమ్మేటి సత్యమోహన్,విత్తనాల శేఖర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం గడప..గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మండలంలోని మెర్లపాలెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసు కుంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి

ఉప్పలగుప్తం వైసిపి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరిందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని భీమనపల్లిలో గురువారం నిర్వహించారు. ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

అప్పుల బాధ తాళలేక ఈ నెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన బొబ్బిల్లంకకు చెందిన కాకర్ల త్రిమూర్తులు(40) బుధవారం మృతి చెందాడు. త్రిమూర్తులు హైదరాబాదులో రెండు రెస్టారెంట్లను నడుపుతున్నాడు. వీటి నిర్వహణ కోసం పలుచోట్ల అప్పులు చేశాడు. వీటిని తీర్చలేక స్వగ్రామమైన బొబ్బిలంకకు వచ్చాడు. ఈ నెల 13న తెల్లవారుజామును కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కాకినాడ జిజిహెచ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్ని ప్రమాదంలో ఏడు పశువుల దహనం

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని చోడవరం గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఆరు గేదెలు, ఒక మేక సజీవ దహనం అయ్యాయి గుర్తుతెలియని వ్యక్తులు పశువులపాకకి నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని రైతు మద్దిపాటి శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాప సిబ్బంది మంటలు అర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. సుమారు 5 లక్షల వరకూ నష్టం వాటిల్లిందన్నారు.